సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం। 18। ఆగస్టు। 2023



యాదాద్రిలో హరినామ సంకీర్తన
యాదాద్రి క్షేత్రంలో హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని ఆలయ అనువంశిక ధర్మ కర్త ప్రారంభించారు.
- 8లో



కౌన్సిల్ సమావేశం రసాభాస
భువనగిరిలోని టీటీడీ కల్యాణ మండపం స్వాధీనంపై మున్సిపల్ కౌన్సిల్ సమావే శంలో విపక్ష సభ్యులు ధ్వజమెత్తారు.
- 9లో



ఆలేరు అభివృద్ధికి విప్ కృషి
ఆలేరు అభివృద్ధికి ప్రభుత్వ విప్ సునీత ఎంతో కృషి చేస్తున్నారని గొంగిడి మహేం దర్‌రెడ్డి, భిక్షమయ్యగౌడ్ అన్నారు.
- 9లో

న్యూస్‌రీల్

నేడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

భువనగిరిటౌన్ : సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు బీసీ కుల సంఘాల నాయకులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆధునిక టెక్నాలజీతో సెల్‌ఫోన్ల రికవరీ



బాధితులకు ఫోన్లు అప్పగిస్తున్న ఏసీపీ

చౌటుప్పల్ : సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తులు ఆందోళన చెందవద్దని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రికవరీ చేస్తామని ఏసీపీ మొగులయ్య తెలిపారు. ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న 15 మంది స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి రికవరీ చేశారు. గురువారం వాటిని బాధితులకు అందజేశారు. సెల్‌ఫోన్ పోయిన వ్యక్తులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎస్.దేవేందర్, పోలీసులు ఉన్నారు.

'తొలిమెట్టు'తో విద్యా సామర్థ్యాల పెంపు



పుస్తక పఠనం చేయిస్తున్న డీఈఓ

భువనగిరి : విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాల పెంపునకు తొలిమెట్టు కార్యక్రమం దోహదపడుతుందని డీఈఓ నారాయణరెడ్డి అన్నారు. గురువారం భువనగిరి మండలంలోని బొమ్మాయిపల్లి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో పుస్తకపఠనం చేయించారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బాలస్వామి, శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాంధీ సినిమాను తిలకించిన విద్యార్థులు
జిల్లాలోని ఎనిమిది థియేటర్లలో ప్రదర్శిస్తున్న గాంధీ సినిమాను గురువారం 3,263 మంది విద్యార్థులు తిలకించినట్లు డీఈఓ నారాయణరెడ్డి అన్నారు. భువనగిరిలోని వసుంధర థియేటర్‌లో గాంధీ సినిమా ప్రదర్శన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ నెల 24 వరకు గాంధీ సినిమా ప్రదర్శన ఉంటుందన్నారు.

ఓపెన్ టెన్త్ అడ్మిషన్ గడువు పెంపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

మోత్కూరు, ఆత్మకూర్(ఎం) : ఓపెన్ టెన్త్ అడ్మిషన్ గడువును ప్రభుత్వం ఈనెల 31వరకు పొడిగించిందని ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూళ్ల కోఆర్డినేటర్ జగదీశ్వర్ తెలిపారు. గురువారం మోత్కూరు, ఆత్మకూర్(ఎం) మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రెగ్యులర్‌గా పాఠశాలకు, కళాశాలకు వెళ్లలేనివారికి, మధ్యలో చదువుమానేసిన వారికి ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ సువర్ణ అవకాశమన్నారు. వివరాలకు సెల్ నంబర్ 9505153211లో సంప్రదించాలని కోరారు. అనంతరం తెలంగాణ ఓపెన్‌స్కూల్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాంప్రసాద్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ



నీటిలో గంబూషియా చేపలను వదులుతున్న వైద్య బృందం

భువనగిరి : గంబూషియా చేపలతో దోమలను నివారించవచ్చని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ వినోద్ అన్నారు. గురువారం భువనగిరి మండలంలోని అనంతారంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో గంబూషియా చేపలను వదిలారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ మధుమోహన్, హెల్త్ ఎడ్యుకేటర్ సాయిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సురేష్ కుమార్, సెక్రటరీ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో టికెట్ హీట్!

రోజురోజుకూ పెరుగుతున్న ఆశావహులు
- నియోజకవర్గానికి నలుగురైదుగురు
- సర్వే నివేదికలు, నేతల పనితీరు ఆధారంగానే అంటున్న అధిష్టానం
- నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ



సాక్షి, యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. ప్రతి నియోజకవర్గంలో నలుగురైదుగురు రేస్‌లో ఉన్నారు. బరిలో నిలిచి తమ భవితవ్యం తేల్చుకోవాలని పావులు కదుపుతున్నారు. అయితే అధిష్టానం మాత్రం నేతల పనితీరు ఆధారంగానే టికెట్‌లు ఇస్తామని చెబుతోంది. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా సర్వే చేయిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆ రెండు.. బీసీలకు కేటాయిస్తారన్న ప్రచారం
భువనగిరి, ఆలేరు స్థానాలను బీసీలకు కేటాయిస్తారన్న ప్రచారం కొంతకాలంగా సాగుతోంది. మూడు రోజుల క్రితం జరిగిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశంలోనూ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. భువనగిరిలో బీసీ సామాజిక వర్గం నుంచి నలుగురు పోటీ పడుతున్నారని ప్రకటించడం అందుకు బలం చేకూరుస్తోంది. అయితే భువనగిరి, ఆలేరు స్థానాలు బీసీలకేనని ఏఐసీసీ, టీపీసీసీ మాత్రం ఎక్కడా ప్రకటించలేదు. ఇక ఆలేరులో బీసీ సామాజికవర్గానికి చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శితోపాటు ఓసీ, ఎస్సీ వర్గాల నుంచి పలువురు నాయకులు టికెట్ ఆశిస్తున్నారు. మునుగోడులో ఓసీ, బీసీ సామాజిక వర్గాల నుంచి పలువురు నేతలు టికెట్ రేసులో ఉన్నారు. నకిరేకల్, తుంగతుర్తి రిజర్వ్ నియోజకవర్గాలు కావడంతో ఆయావర్గాల నుంచి కొందరు టికెట్ ఆశిస్తున్నారు.

దరఖాస్తు చేసుకుంటేనే..
అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకునే అభ్యర్థులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని టీపీసీసీ సూచించింది. శుక్రవారం (నేడు) నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. టికెట్ కోసం ఎంత మంది అయినా దరఖాస్తు చేసుకోవచ్చని అధిష్టానం తెలిపింది. ఇందుకు ఆశావహులు రెడీ అవుతున్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే?
బీజేపీలో ఉన్న ఓ మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న ఓ మాజీ ఎమ్మెల్యే తమ రాజకీయ భవిష్యత్‌పై డోలాయమానంలో ఉన్నట్లు తెలుస్తోంది. వీరిద్దరూ కాంగ్రెస్ కండువా కప్పుకోబోతున్నారన్న చర్చ నడుస్తోంది. ఈ ఇద్దరు నేతలు గతంలో కాంగ్రెస్ నుంచి ఎంపీగా, ఎమ్మెల్యేగా గెలిచిన వారే కావడం విశేషం. అయితే వచ్చే ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలన్న పట్టుదలతో ఉన్న వీరిద్దరు.. తమ అనుచరులతో చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ మార్పుపై ఇప్పటికిప్పుడు స్పష్టత ఇవ్వకపోయినా ఎన్నికల నాటికి ఏదైనా జరిగే అవకాశం లేకపోలేదన్న చర్చ నడుస్తోంది.

హస్తం వైపు ముఖ్య నేతల చూపు
బీఆర్‌ఎస్, బీజేపీలోని అసమ్మతి నేతలు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలు ఉన్నాయి. సంవత్సరాల తరబడి సేవలందించినా లబ్ధి చేకూరలేదన్న నిరాశతో కొందరు, విధివిధానాలు నచ్చక మరికొందరు కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. భువనగిరి నియోజకవర్గంలో సీనియర్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డిలు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

5కే రన్‌ను విజయవంతం చేయాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



5 కే రన్‌పై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్, చిత్రంలో అదనపు కలెక్టర్లు, అధికారులు

సాక్షి, యాదాద్రి : ఓటు హక్కు వినియోగం, ఆవశ్యకతపై ఈనెల 19న నిర్వహించనున్న 5కె రన్‌లో అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి కోరారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల విభాగం అధికారులతో 5కే రన్‌పై సమీక్ష నిర్వహించారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో ఉదయం 6 గంటలకు రన్ ఉంటుందన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఓటరు నమోదు అవశ్యకత, ఓటు హక్కు వినియోగం తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు 5 కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భువనగిరి నియోజకవర్గానికి సంబంధించి భువనగిరిలోని జూనియర్ కాలేజీ నుంచి రైల్వే స్టేషన్ వరకు తిరిగి జూనియర్ కాలేజీ వరకు రన్ ఉంటుందన్నారు. ఆలేరు నియోజకవర్గానికి సంబంధించి ఆలేరులోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు, తిరిగి తహసీల్దార్ కార్యాలయం వరకు 5 కే రన్ ఉంటుందన్నారు. రన్‌లో విద్యార్థులు, యువత, అధికారులు, అధికారులు, పోలీసు సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా మహిళా బృందాలు, ఆశ కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదవడం, ఓటు వేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలని తెలియజేయడమే 5 కే రన్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, డీఈఓ నారాయణరెడ్డి, యాదగిరిగుట్ట ఏసీపీ శివరామిరెడ్డి, కలెక్టరేట్ ఇంచార్జ్ ఏఓ నాగేశ్వరాచారి, భువనగిరి మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ అంజిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



వలిగొండ జూనియర్ కళాశాలలో మొక్కలను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్

వలిగొండ : హరితహారంలో నాటిన మొక్కలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి సంరక్షించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి కోరారు. వలిగొండలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాటిన మొక్కలను గురువారం ఆయన పరిశీలించారు. మాస్ ప్లాంటేషన్‌లో ప్రతి గ్రామానికి 750 మొక్కలు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ధరణి పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని, ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం నాగారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గీతారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ తీగల కిష్టయ్య, ఆర్‌ఐలు రాజేష్, విక్రమ్, నాగార్జున, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మలరామారం ఎస్‌ఐకి ప్రశంసాపత్రం



ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డికి ప్రశంసా పత్రం అందజేస్తున్న రాచకొండ సీపీ చౌహాన్

బొమ్మలరామారం : చోరీ కేసులను స్వల్ప వ్యవధిలో ఛేదించి నగదు రికవరీ చేసిన బొమ్మలరామారం ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డికి ప్రశంసలు దక్కాయి. బొమ్మలరామారం మండలంలోని తిర్మలగిరిలో జూన్ 22న దారవత్ బిచ్చాలునాయక్ ఇంట్లో రూ.60.50 లక్షలు, జూలై 27న మల్యాల గ్రామంలో దొమ్మాట శంకర్ ఇంట్లో రూ.14లక్షలను దొంగలు అపహరించుకెళ్లారు. రెండు కేసుల్లో ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి చాకచక్యంగా వ్యవహరించి 24 గంటల్లోనే దొంగలను గుర్తించి నగదు రికవరీ చేశారు. ఇందుకు గాను ఎస్‌ఐకి గురువారం సీపీ డీఎస్ చౌహాన్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రశంసాపత్రం అందజేశారు.

వలిగొండ మార్కెట్ చైర్మన్‌గా రాజవర్ధన్‌రెడ్డి

- వైస్ చైర్మన్‌గా కమ్మంపాటి శ్రీనివాస్‌గౌడ్
- ఉత్తర్వులు జారీ చేసిన వ్యవసాయ సహకార శాఖ చీఫ్ సెక్రటరీ



పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి



కమ్మంపాటి శ్రీనివాస్‌గౌడ్

రామన్నపేట : వలిగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ (కేంద్ర కార్యాలయం రామన్నపేట) చైర్మన్‌గా వలిగొంగ మండలంలోని సుంకిశాలకు చెందిన పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా పల్లివాడకు చెందిన కమ్మంపాటి శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయ సహకారశాఖ చీఫ్ సెక్రటరీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. డైరెక్టర్లుగా కందుల శ్రీను, బండ ఉపేందర్‌రెడ్డి, కాసుల మధుసూధన్, సింగనబోయిన దశరథ, వడిచర్ల మల్లేష్, బొడ్డు అల్లయ్య, మర్రి వెంకటేశం, పున్న వెంకటేశం, క్యాస వీరస్వామి, నర్ర నర్సింహ, గోరంటి రమేష్, తవుటం నరహరిని ప్రభుత్వం నియమించింది. వలిగొండ పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, వలిగొండ సర్పంచ్‌ను సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం దుకాణాలకు 2,462 దరఖాస్తులు

భువనగిరి : నూతన మద్యం దుకాణాల కేటాయింపునకు దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 82 దుకాణాలకు గాను గురువారం నాటికి మొత్తం 2,462 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. గత సంవత్సరంతో పోల్చితే ఈ సారి దరఖాస్తుల సంఖ్య పెరిగాయని, శుక్రవారం చివరి గడువు కావడంతో దరఖాస్తులు మరిన్ని వచ్చే అవకాశం ఉందన్నారు. సర్కిళ్ల వారీగా రామన్నపేట 219, మోత్కూర్ 128, ఆలేరు 197, భువనగిరి పరిధిలో 246 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా చౌటుప్పల్ మండల పరిధిలోని ఎల్లంబావి మద్యం దుకాణానికి 111 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గురువారం నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి, తులసీ దళాలతో అర్చించారు. ప్రధానాలయం ముఖ మండపంలో అష్టోత్తర పూజలు శ్రీసుదర్శన హోమం, గజవాహనసేవ, కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ, సహస్రనామార్చన చేశారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

పట్టువీడని సెకండ్ ఏఎన్‌ఎంలు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రెండవ ఏఎన్‌ఎంలు

డిమాండ్ల సాధన కోసం 13 రోజులుగా ఆందోళన
- నిలిచిపోయిన సేవలు
- జిల్లాలో 118 మంది రెండవ ఏఎన్‌ఎంలు

డిమాండ్లు ఇవే..
- రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి
- పనికి తగిన వేతనం చెల్లించాలి, పీఆర్‌సీ పే స్కేల్, హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయాలి.
- మహిళా ఉద్యోగినులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు 180 రోజులు ఇవ్వాలి
- ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు చెల్లించాలి. ఏరియర్స్ ఇవ్వాలి.

భువనగిరి : నేషనల్ హెల్త్ మిషన్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. 13 రోజులుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆందోళన ఉధృతం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

రెండవ ఏఎన్‌ఎంల విధులు ఇవీ..
జిల్లాలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఐదుగురు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 113 మంది రెండవ ఏఎన్‌ఎంలు సుమారు 15 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా చిన్న పిల్లలకు సరియైన సమయంలో టీకాలు వేయించడం, మాతాశు మరణాలు తగ్గించేలా, గర్భిణులను గుర్తించి ప్రసవం అయ్యే వరకు ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకువెళ్లడం, రక్తహీనత, బీపీ, షుగర్ వంటి సుమారు 33 రకాల కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారు. కరోనా సమయంలో సైతం ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహించారు. మొదటి ఏఎన్‌ఎంలతో సమానంగా విధులు నిర్వహిస్తున్న గుర్తింపులేదనే కారణతో రెండవ ఏఎన్‌ఎంలు పోరుబాట పట్టారు.

సేవలకు ఆటంకం
రెండవ ఏఎన్‌ఎంలు ఆందోళన బాట పట్టడంతో వైద్యారోగ్య శాఖలో పలు రకాల సేవలు నిలిచిపోయాయి. మాతాశిశు సంరక్షణలో భాగంగా గర్భిణులను గర్తించి వారిని ఆస్పత్రికి తీసుకెళ్లడం, చిన్న పిల్లలకు టీకాలు, గర్భిణులకు ప్రసవాలు చేయించడంతోపాటు బీపీ, షుగర్, టీబీ, క్యాన్సర్, లెప్రసీ, ఫైలేరియా బాధితులకు చికిత్స వంటి పనులు చేపడుతున్నారు. ఇవే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి సుమారు 32 రకాల సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వం దిగివచ్చే దాకా ఆందోళన కొనసాగిస్తామంటున్నారు.

పర్మినెంట్ చేయాలి



తమను రెగ్యులరైజ్ చేయాలని ఎంతోకాలంగా అందోళన కార్యక్రమాలు చేపడుతున్నాం. అయినా ప్రభుత్వం స్పందించడం లేదు. దీంతో సమ్మె చేయవల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రెండవ ఏఎన్‌ఎంల డిమాండ్లు నెరవేర్చాలి.
–నీలిమా, రెండవ ఏఎన్‌ఎంల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా



సుమారు 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అనే కార్యక్రమాలు అమలు చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నాం. మొదటి ఏఎన్‌ఎంలతో సమానంగా రెండో ఏఎన్‌ఎంలు పని చేస్తున్నాం. ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి తమను రెగ్యులరైజ్ చేయాలి.
–కె .దనలక్ష్మి, రెండవ ఏఎన్‌ఎం

రోడ్డు పనులు రయ్..రయ్!

రామన్నపేట పరిధిలో చురుగ్గా రహదారి విస్తరణ
- కల్వర్టుల నిర్మాణం, చెట్ల తొలగింపు పూర్తి
- విద్యుత్ లైన్‌ల మార్పు
- రూ 8.50 కోట్ల వ్యయంతో పనులు
- పూర్తయితే మండల కేంద్రానికి పూర్వ వైభవం



రామన్నపేట శివారులో రోడ్డు విస్తరణ పనులు



స్వచ్ఛందంగా డబ్బాలు తొలగిస్తున్న యజమానులు

రామన్నపేట: భువనగిరి– చిట్యాల రోడ్డు విస్తరణ పనులు రామన్నపేట పరిధిలో శరవేగంగా జరుగుతున్నాయి. రూ 8.50 కోట్ల వ్యయంతో చేపట్టిన విస్తరణ పూర్తయితే రూపురేఖలు మారనున్నాయి. నియోజకవర్గం కేంద్రంగా.. తాలుకా సెంటర్‌గా, మున్సిపాలిటీగా వెలుగొందిన రామన్నపేట పూర్వ వైభవం సంతరించుకోనుంది.

రూ.8.50 కోట్లు విడుదల
చిట్యాల–భువనగిరి రోడ్డు 45 కిలోమీటర్లు ఉండగా ఇందులో రామన్నపేట పట్టణంలో 35/6 కి.మీ. నుంచి 37 కి.మీ వరకు.. అలాగే సుభాష్ సెంటర్ నుంచి గాంధీ విగ్రహం వరకు అమ్మనబోలు వరకు రోడ్డును మొత్తం రెండు కిలోమీటర్ల మేర నాలుగులేన్లుగా విస్తరించేందుకు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రతిపాదనలు పంపగా రాష్ట్ర ప్రభుత్వం రూ.8.50కోట్లు విడుదల చేసింది. దీంతో సంబంధిత అధికారులు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి గత నెలలో పనులు ప్రారంభించారు.

ఒకవైపునే 4 మీటర్లకు పైగా వెడల్పుతో..
విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా డబ్బా కొట్ల నిర్వాహకులు స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. రోడ్డుకు ఒకవైపు 4.75మీటర్ల వెడల్పులో మట్టిని తొలగించి మెటల్‌తో నింపి రోలింగ్ చేశారు. ఐదుచోట్ల కల్వర్టు పనులు పూర్తి చేశారు. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతుండగా విద్యుత్‌లైన్లను మార్పు చేస్తున్నారు. ఇదిలా ఉంటే రోడ్డు మధ్యలో 2 మీటర్ల వెడల్పుతో డివైడర్‌ను ఏర్పాటు చేసి ఇరుపక్కల 7 మీటర్ల వెడల్పుతో నాలుగులేన్ల రహదారిని (బీటీ పోర్షన్) నిర్మించనున్నారు. బీటీ తర్వాత ఇరువైపులా రెండు మీటర్ల వెడల్పుతో మట్టితో షోల్డర్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నప్పటికీ రోడ్డు వెడల్పు అవుతున్నందుకు స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు విస్తరణ హర్షణీయం



రామన్నపేట పట్టణంలో చిట్యాల–భువనగిరి రోడ్డుతో పాటు, సుభాష్ రోడ్డు విస్తరించడం హర్షణీయం. సుభాష్ రోడ్డు విస్తరణతో వ్యాపారులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఎమ్మెల్యేకు మా ఇబ్బందులు విన్నవించాం. అధికారులతో మాట్లాడి తగిన నష్టం పరిహారం వచ్చేలా చూడాలి.
–ఎంఏ వహీద్, వ్యాపారి, రామన్నపేట

రూపురేఖలు మారిపోతాయి



రహదారి విస్తరణ పనులు ఊహించిన దానికన్నా వేగంగా జరుగుతున్నాయి. పనులు పూర్తయితే రామన్నపేట రూపురేఖలు మారిపోతాయి. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రత్యేక చొరవ వల్లే విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
– గొరిగె నర్సింహ, ఎంపీటీసీ, రామన్నపేట

గుట్టలో అన్ని జిల్లాల బస్సులు ఆపాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట బస్సు డిపోను యథావిధిగా కొనసాగించాలని, బస్టాండ్‌లో అన్ని జిల్లాల బస్సులు నిలిపేవిధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. యాదగిరిగుట్టలో గురువారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డిపో, బస్టాండ్‌ను తరలించడం ద్వారా వ్యాపారులు, స్థానికులు నష్టపోతారని పేర్కొన్నారు. వైకుంఠద్వారం నుంచి పాతగుట్ట చౌరస్తా వరకు నిర్మించిన ఫ్లైఓవర్‌తో ప్రజలు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తొలగించాలన్నారు. పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని మంత్రి కేటీఆర్, విప్ గొంగిడి సునీత హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. యాదాద్రి కొండపైన వ్యాపారులు, భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో ఈఓకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. యాదగిరిపల్లి, గుండ్లపల్లి, పాతగుట్టలో నెలకొన్న సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి జిల్లా జానకిరాములు, సహాయ కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన బంగారి, గోపగాని రాజు, రాయగిరి బాలకిషన్, మూనుకుంట్ల నర్సమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న సీపీ చౌహాన్

భువనగిరి : అనారోగ్యంతో మృతిచెందిన భువనగిరి పట్టణానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ విజయ భాస్కర్‌రావు కుటుంబ సభ్యులకు గురువారం రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ డీఎస్ చౌహాన్ రూ. 7,77,058ల విలువ చేసే చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీపీ చౌహాన్ మాట్లాడారు. మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి త్వరగా పెన్షన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజేష్ చంద్ర పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేరేడుచర్ల : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిచాలని కోరుతూ బీఆర్‌టీయూ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిలువేరు ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో సీడీఎంఏ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపల్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కె జాని, నాయకులు శ్రీనయ్య, నర్సింహారావు, సమ్మయ్య, సతీష్, మహేందర్, మల్లేశం, ప్రసాద్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



జీవరత్నం మృతదేహం

తిరుమలగిరి (నాగార్జునసాగర్): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. తిరుమలగిరి మండలం అల్వాల గ్రామశివారులో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా.. నిడమనూరు మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన కొండేటి జీవరత్నం(40) హిటాచ్చి(జేసీపీ చైన్ బండి) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం పెద్దవూర మండలం చలకూర్తి గ్రామశివారులో పనిచేసుకొని తిరిగి నాగార్జునసాగర్ ఎడమ కాలు కట్ట మట్టి రోడ్డు వెంట లారీపై హిటాచ్చిని తీసుకొని వస్తున్నాడు. ఈ క్రమంలో అల్వాల ఆర్ 1 లిఫ్ట్ వద్ద 11కేవీ విద్యుత్ వైరు లారీపై ఉన్న హిటాచ్చికి తాకడంతో అందులో ఉన్న జీవరత్నం విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. అటువైపుగా వెళ్తున్న వారు గమనించి సంఘటన స్థలం వద్దకు వచ్చి పోలీసులకు సమాచారం అదించారు. ఎస్‌ఐ సురేష్ తన సిబ్బందిని తీసుకొని సంఘటన స్థలానికి చేరుకొని జీవరత్నంను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.


పురుగుల అన్నం వద్దంటూ..

- హాలియా తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థుల ధర్నా



హాలియా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

హాలియా : మధ్యాహ్న భోజనంలో పురుగుల అన్నం వడ్డించారని ఆరోపిస్తూ హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గురువారం హాలియాలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మొత్తం 350 మంది విద్యార్థులు ఉండగా ప్రతి రోజు 250 మంది దాక మధ్యాహ్న భోజనం తింటున్నారు. అయితే గురువారం మధ్యాహ్నం వడ్డించిన భోజనంలో పురుగులు కనిపించడంతో ఈ అన్నం మేము తినలేమంటూ ఒక్కరిగా విద్యార్థులంతా కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి ప్లేట్లతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వడ్డిస్తున్న భోజనంలో పురుగులు వస్తున్నాయని తెలిపారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పలు మార్లు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని వాపోయారు. విద్యార్థుల సమస్యను పట్టించుకునే దాక ఇక్కడి నుంచి కదిలేదిలేదని భీష్మించి కూర్చున్నారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ బుసిరెడ్డి రామకృష్ణారెడ్డి విద్యార్థుల వద్దకు వచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పాఠశాల వద్దకు వెళ్లి ఆయన మధ్యాహ్నం భోజనం వడ్డించిన బియ్యాన్ని పరిశీలించారు. అందులో పురుగులు ఉన్నట్లు గుర్తించారు. పురుగులు పట్టిన బియ్యాన్ని విద్యార్థులకు వడ్డించ వద్దని వెంటనే ఆ బియ్యాన్ని తిరిగి పంపించాలని డిప్యూటీ తహసీల్దార్ పాఠశాల ఏజెన్సీకి సూచించారు. ఇదే విషయంపై పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డిని వివరణ కోరగా ఎక్కువ కాలం బియ్యం నిల్వ ఉండడం కారణంగా బూజు పట్టాయని, వాటిని ఎప్పటికప్పుడు కడిగి శుభ్రం చేశాకే మధ్యాహ్న భోజన నిర్వాహకులు అన్నం వండుతున్నారన్నారు. ఈ రోజు మాత్రమే విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్నభోజనంలో పురుగులు వచ్చాయని, ఇక నుంచి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



అన్నంలో వచ్చిన పురుగులు

యువతిని మోసగించిన వ్యక్తికి పదేళ్ల జైలు

రామగిరి(నల్లగొండ): ప్రేమ పేరుతో యువతిని మోసగించిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ మహిళా కోర్టు జడ్జి తిరుపతి గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.... మర్రిగూడ మండలం సరంపేటకు చెందిన యువతి అమ్మమ్మ గ్రామమైన సంస్థాన్‌నారాయణపురం మండలం జనగాంలో ఉంటోంది. రోజు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తుంది. కూలి పనికి వెళ్తున్న క్రమంలో నారాయణపురం మండలం వాయిలపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గుండెపంగ నరేష్‌తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని గయువతికి మాయ మాటలు చెప్పాడు. పలు సార్లు శారీరకంగా లోబర్చుకున్నాడు. 2017 మే 23న పుట్టినరోజు సందర్భంగా యువతిని సర్ల మైసమ్మ గుడికి తీసుకెళ్లాడు. గుడి సమీపంలో యువతిపై లైంగిక దాడి చేశాడు. యువతి వివాహం చేసుకోమని నరేష్‌ను నిలదీయగా నిరాకరించాడు. పెద్ద మనుషుల సమక్షంలో కోరినా నరేష్ తిరస్కరించాడు. దీంతో యువతి 2017 మే 25న నారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ పార్థసారథి, ఎస్‌ఐ మల్లీశ్వరి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరమణారెడ్డి వాదనలతో ఏకీభవించిన మహిళా కోర్టు జడ్జి తిరుపతి అత్యాచారానికి పాల్పడినందుకు గాను సెక్షన్ 376 కింద పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. మిర్యాలగూడ, కోదాడలో జరిగిన ఈ ఘటనల వివరాలు ఇలా.. మిర్యాలగూడ పట్టణం నాగార్జుననగర్ కాలనీలో నివాసముంటున్న రాగిరెడ్డి జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి బుధవారం ఉదయం 10గంటలకు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారం ఉదయం పాలు పోయడానికి వచ్చిన వ్యక్తికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో యజమాని జగ్గారెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. దీంతో పట్టణానికి వచ్చిన ఆయన ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందర చేసి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.దుండగులు 6 తులాల బంగారు, 35 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లినట్లు గురించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని శ్రీమాన్నారాయన కాలనీలో నివాసం ఉండే గొట్టిపర్తి రమణమ్మ ఉద్యోగ రీత్యా విజయవాడలో ఉంటోంది. ఇంట్లో నివాసం ఉండే ఆమె చిన్న కుమారుడు సతీష్ ఈ నెల 8న వియవాడకు వెళ్లాడు. 12న ఆమె పెద్దకుమారుడు ఇంటికి వచ్చి చూసేవరకు తాళం పగలకొట్టి బీరువా తీసి సామగ్రి చిందరవందరగా పడి ఉంది. విషయాన్ని తల్లి, సోదరుడికి తెలపగా వారు వచ్చి చూసే వరకు బీరువాలో ఉన్న 17.9 తులాల బంగారం, రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నాగయ్య (ఫైల్)

హుజూర్‌నగర్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ మండల పరిధిలో ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొండానాగయ్య(38) పేయింటర్‌గా పనిచేస్తున్నాడు.16ఏళ్ల క్రితం గోపాలపురానికి చెందిన సిద్దెల భిక్షం కుమార్తె రేణుకతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు కుమార్తె సంతానం.ఈ క్రమంలో నాగయ్య భార్య ఇద్దరు పిల్లలతో స్వగ్రామమైన సింగారెడ్డి పాలెంనుంచి ఈనెల 14న కోదాడలోని బంధువుల ఇంటికి వెళ్లాడు.అదే రోజు సాయంత్రం అత్తగారిల్లైన హుజూర్‌నగర్ మండలం గోపాలపురానికి చేరుకున్నారు.

ఇటుక బట్టీల సమీపంలో విగతజీవుడిగా..

మరుసటి రోజు 15వ తేదీన తెల్లవారుజామునే నాగయ్య గోపాలపురం నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. నాగయ్య ఇంటికి చేరిన తెలుసుకునేందుకు మామ భిక్షం అల్లుడికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. బంధువుల ద్వారా నాగయ్య ఇంటికి చేరలేదనే విషయం తెలుసుకుని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే గురువారం గోపాలపురంలో సమీపంలో రోడ్డు పక్కన ఇటుక బట్టీల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం నాగయ్యదిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి మామ భిక్షం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు.

ఆస్తమా వ్యాధి నివారణకు కృషి



రీసెర్చ్ మద్దతు పత్రాన్ని పరిశోధన వైద్యుడికి అందజేస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్

బీబీనగర్: ఆస్తమా వ్యాధి నివారణకు కృషి చేయనున్నట్లు ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా తెలిపారు. ఆస్తామా వ్యాధిపై పరిశోధన చేసేందుకు డీబీటీ ఇండియా నుంచి ఎయిమ్స్ వైద్యులకు రీసెర్చ్ గ్రాంట్ ద్వారా మద్దతు లభించిన సందర్భంగా ఆయన గురువారం ఎయిమ్స్‌లో వైద్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశంలోని 30మిలియన్లకు పైగా ప్రజలు ఉబ్బసం కలిగి వున్నారని, వారిలో 70శాతం మందికి మాత్రమే రోగ నిర్ధారణ ఉందని తెలిపారు. సమావేశంలో వైద్యులు రోహిత్ సలూజా, హిమాద్రిసింగ్, అలేక్‌ష్‌ఖురానా, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

దైవదర్శనం చేసుకొని వస్తూ.. మృత్యుఒడికి

- రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

నార్కట్‌పల్లి : గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. నార్కట్‌పల్లి మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామానికి చెందిన జంగిలి రాకేష్, తన భార్య లిఖిత (20), తల్లి అలువేలుతో కలిసి బుధవారం నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిద్ర చేశారు. గురువారం ఉదయం దైవ దర్శనం చేసుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి మండల పరిధిలోని గ్రీన్‌సిటీ వెంచర్ సమీపంలోకి రాగానే నల్లగొండ నుంచి నార్కట్‌పల్లి వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న లిఖిత (20)తో పాటు భర్త, అత్తకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన లిఖితను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. గాయపడిన మరో ఇద్దరిని స్థానిక కామినేని ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఆవుల ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.



లిఖిత (ఫైల్)

బైకు పైనుంచి జారిపడి మహిళ ..

చౌటుప్పల్ : ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం పైనుంచి జారిపడి మహిళ మృతి చెందింది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన రుద్రాల కవిత(39) జీహెచ్‌ఎంసీలో ఔట్ సోర్సింగ్ స్వీపర్‌గా పని చేస్తుంది. కుటుంబ సభ్యులతో కలిసి అంబర్‌పేటలో నివాసం ఉంటోంది. తెలిసిన వ్యక్తితో కలిసి బైకుపై నార్కట్‌పల్లి నుంచి అంబర్‌పేటకు వెళ్తుండగా దండుమల్కాపురం గ్రామపంచాయతీ మధిర బొర్రోళ్ల గూడెం స్టేజీ వద్ద హైవేపై ప్రమాదవశాత్తు జారి కిందపడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.దేవేందర్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

నకిరేకల్ : బైక్ అదుపుతప్పి యువకుడు మృతిచెందాడు. సూర్యాపేట పట్టణానికి చెందిన నల్లగట్టు ఆనంద్(20) గురువారం ఉదయం తన బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఆనంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని నకిరేకల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తల్లి ఝాన్సీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

ఆ అడుగులు.. చిరుతవి కావు

- అటవీశాఖ రేంజ్ అధికారి బాచిరెడ్డి

గుర్రంపోడు : గుర్రంపోడు మండలంలోని నడికూడ గ్రామంలో కనిపించిన అడుగులు చిరుతపులివి కావని నిర్ధారించినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి బాచిరెడ్డి తెలిపారు. పులి గోర్ల ముద్రలు లేవని అడుగులు అడవికుక్క లేదా హైనావి అయి ఉండవచ్చునని తెలిపారు. హైనాలతో మనుషులకు ఎలాంటి ప్రమాదం ఉండదని, మేకలు, గొర్రెల మీద దాడి చేసి తింటుందని తెలిపారు. ఇప్పటి వరకు ఆహారం కొరకు ఎలాంటి జంతువు బలి అయినట్లు సమాచారం లేనందున అడవి కుక్క కావొచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు భయాందోళనకు గురికావద్దన్నారు.

మెడికల్ షాపులో నగదు చోరీ

ఆలేరురూరల్ : గుర్తుతెలియని వ్యక్తులు మెడికల్ షాపులో చోరీకి పాల్పడ్డారు. ఆలేరు పట్టణ కేంద్రంలో బస్టాండ్ ఎదురుగా ఉన్న పద్మజా మెడికల్ షాపును యజమాని సారాబు సంతోష్ రాత్రి 9 గంటలకు మూసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో దొంగలు షటర్ తాళం పగలగొట్టి లోపలికి చొరబడి గల్లా పెట్టెలో ఉన్న రూ. 95 వేల నగదును ఎత్తికెళ్లారు. పక్కన ఉన్న మరో సాయి కృష్ణ కమ్యూనికేషన్ షాపులో చోరీకి యత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

గడ్డి మందు తాగిన యువతి మృతి

మోతె : కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. చివ్వెంల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన గుండారపు సైదులు, నాగమ్మ దంపతుల కుమార్తె వినితకు మూడు నెలల కిత్రం మోతె మండలం రావిపహాడ్ గ్రామానికి చెందిన నిమ్మల మల్లయ్యలక్ష్మమ్మ దంపతుల చిన్న కుమారుడు నరేష్‌తో వివాహం జరిగింది. వినిత నెల రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. మనస్తాపం చెందిన వినిత ఈ నెల 12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం సూర్యాపేటలో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోతె ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇద్దరు బాలురు అదృశ్యం

పాలకవీడు: సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల పరిధిలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన పదేళ్ల బాలురు రాముడు, లక్ష్మణుడు గురువారం అదృశ్యమయ్యారు.ఎస్‌ఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన మంగమ్మ తులసిరాం దంపతులకు రాముడు, లక్ష్మణుడు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలం క్రితం తండ్రి చనిపోగా తల్లి మంగమ్మ మరొకరిని వివాహం చేసుకుని వెళ్లింది. అప్పటి నుంచి పిల్లలను గుడుగుంట్లపాలెంలోని మేమామ వీరబాబు పెంచుతున్నాడు. గురువారం ఉదయం స్కూల్‌బ్యాగులు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిన బాలురు తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వీరబాబు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగయ్య తెలిపారు.

పెట్రోల్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

కట్టంగూర్ : జాతీయ రహదారిపై కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో గురువారం ప్రమాదవశాత్తు పెట్రోలు ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాదు నుంచి విజయవాడ వైపు వెళుతున్న పెట్రోల్ ట్యాంకర్ అయిటిపాముల గ్రామ సమీపంలోకి రాగానే ఆకస్మాత్తుగా ఆగిపోయింది. అదే సమయంలో హైదరాబాదు నుంచి ఖమ్మం వెళుతున్న ఆర్టీసీ బస్సు ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 16 మంది ప్రయాణికులకు ఏలాంటి ప్రమాదం జరగపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. ట్యాంకర్ వెనక భాగం పగిలిపోవటంతో విషయం తెలుసుకున్న హిందుస్థాన్ పెట్రోలు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వేరే ట్యాంకర్‌లోకి పెట్రోలును షిఫ్ట్ చేసి తరలించారు.

ఆరోగ్యం కుదుట పడడం లేదని..

- పురుగుల మందు తాగి ఆత్మహత్య

మునుగోడు : ఎంతో మంది వైద్యుల వద్ద చికిత్స పొందినా ఆరోగ్యం కుదుట పడడం లేదని మనోవేదనతో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. మునుగోడు మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం ఇప్పర్తి గ్రామానికి చెందిన ఆడెపు నాగమ్మ(32) కొంతకాలంగా నోటికంతి బాధపడుతోంది. ఐదు సార్లు శస్త్ర చికిత్స కూడా చేయించుకున్నా ఫలితం కనిపించలేదు. ఇక తనకు వివాహం కూడా కాదని తీవ్ర మనస్తాపం చెందిన నాగమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం పురుగుల మందు తాగింది. గమనించిన చుట్టుపక్కలవారు ఆమెను మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



నాగమ్మ మృతదేహం

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

దేవరకొండ : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. దేవరకొండ పట్టణానికి చెందిన గొని వేణునాథంగౌడ్ (23) రెండు రోజుల క్రితం ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు, కాలనీవాసులు అతడిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి తండ్రి శివరాంగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగభూషణంరావు తెలిపారు.

ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలి



నందిపాడులో పంటలను పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : సాగర్ ఎడమకాల్వ ద్వారా నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. మిర్యాలగూడ మండలంలోని నందిపాడులో ఎండిపోతున్న పంటలను గురువారం రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఖరీఫ్‌లో కొంతమంది రైతులు నాట్లు వేసుకుని ఉన్నారని, వర్షాలు సరిగా కురవకపోవడంతో భూగర్భజలాలు సైతం ఎండిపోయాయని తెలిపారు. సాగర్ ఎడమకాల్వ ద్వారా నీరు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగర్ ఎడమకాల్వ ద్వారా నీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, మండల కార్యదర్శి రవినాయక్, పగిడోజు రామ్మూర్తి, రాగిరెడ్డి మంగారెడ్డి, పాల్వాయి రాంరెడ్డి, పఠాని శ్రీను, భిక్షం, మోహన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎర్రవరంలో హీరో శ్రీకాంత్ దంపతుల పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న హీరో శ్రీకాంత్, ఊహ దంపతులు

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని ఎర్రవరంలోగల దూళ్లగుట్ట శ్రీబాల ఉగ్రలక్ష్మీ నృశింహస్వామి ఆలయాన్ని సినీ హీరో శ్రీకాంత్ కుటుంబ సభ్యులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నలజాల జగన్నాథం , ప్రధాన అర్చకులు ఇనుపకుతికెల లక్ష్మీనరసింహమూర్తిలు శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హీరో శ్రీకాంత్‌తో పాటు భార్య ఊహ, కుమారుడు రోషణ్‌తో కుటుంబ సమేతంగా ఈ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి తనవవంతుగా సహకారం అందిస్తానని హీరో శ్రీకాంత్ తెలిపారు. అక్కడకు వచ్చిన భక్తులు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. అనంతరం ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహమూర్తి నివాసానికి వెళ్లి సేదదీరారు.

నేరేడుచర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో భారీగా అడ్మిషన్లు



200 సంఖ్య ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం 200 వరకు అడ్మిషన్లు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎల్. శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం ఆయన పాఠశాలలో రెండు వందలు అడ్మిషన్లు వచ్చిన సందర్భంగా 200 ఆకారంలో విద్యార్థులను కూర్చోబెట్టి సంబరాలు నిర్వహించి మాట్లాడారు. నాణ్యమైన విద్య, క్రమ శిక్షణ, ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న పౌష్టికాహారం, డిజిటల్ విద్య అమలు చేస్తున్నందున భారీ స్థాయిలో పాఠశాలలో విద్యార్థులు చేరినట్లు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల పెరుగుదలకు కృషి చేసిన ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సకుమారీ, పద్మావతి, సైదులు, రషీద్ ఖాన్, శౌరీ, వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహ్మారావు, కళ్యాణి, భవానీ, రవి, కృష్ణ ప్రసాద్, శ్రీని వాస్‌రావు, శ్రవంతి, లాలు, విజయలక్ష్మి, సరస్వతి ఉన్నారు.

ఇటు పోరాటం.. అటు మమకారం !



తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ నల్లగొండ కలెక్టరేట్ ఎదుట రెండవ ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఈ సమ్మెలో పాల్గొనడానికి ఓ ఏఎన్‌ఎం తన చంటి బిడ్డతో వచ్చింది. ఆమె తన బిడ్డను అక్కడే లాలించి పడుకోబెట్టి ఆందోళనలో పాల్గొంది.
-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

యాదాద్రిలో హరి నామ సంకీర్తన



హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నర్సింహమూర్తి

యాదగిరిగుట్ట: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయంలో గురువారం హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ప్రారంభించారు. స్వామివారికి సంకీర్తన అత్యంత ప్రీతికరమని, నవ విధ భక్తి మార్గాల్లో సంకీర్తన మోక్షానికి అత్యంత దగ్గరి మార్గమని భావించిన అధికారులు ఆలయ ప్రాకార మండపంలో హైదరాబాద్‌కు చెందిన హరినామ సంకీర్తన భక్త భజన సంకీర్తన ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో, స్థానిక భజన మండలి వారిచే హరినామ సంకీర్తన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా భజన మండలి కళాకారులు హరినామ సంకీర్తన చేశారు. యాదాద్రి ఆలయంలో ప్రప్రథమంగా ఈ హరినామ సంకీర్తనను ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. నెల రోజుల పాటు ఈ హరినామ సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు ఈ హరినామ సంకీర్తనలో పాల్గొని తన్మయత్వం పొందారు. అంతకు ముందు కళాకారులు జయ నారసింహ జై.. ఉగ్ర నారసింహ..లక్ష్మీ నారసింహ జై అంటూ హరినామ సంకీర్తన చేశారు.